
# అభివృద్ధికి ఆకర్షితులై..

- బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు





కోనరావుపేట: చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో చేరిన సుద్దాల జేఏసీ నేతలు వేములవాడ: చల్మెడ సమక్షంలో పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు గంట్యాల ప్రకాశ్

వేములవాడ/కోనరావుపేట/మేడిపల్లి, నవంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. శనివారం వారు వేర్వేరు కార్యక్రమాల్లో పలువురు నాయకులకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ క్రమంలో సుద్దాల గ్రామానికి చెందిన జేఏసీ గ్రామాధ్యక్షుడు ఉప్పుల అంజనేయులుతో పాటు ఓద్యారపు శంకర్, దొబ్బల లక్ష్మణ్, కొమురయ్య, అంజనేయులు, బొల్లు రాములు, రమేశ్ బీఆర్ఎస్‌లో చేరగా, చల్మెడ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, గ్రామాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్, కాశవేణి మహేశ్‌యాదవ్ ఉన్నారు.

***బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకుడు***

వేములవాడ పట్టణంలోని 15వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సంయుక్త కార్యదర్శి గెంట్యాల ప్రకాశ్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెరుమాండ్ల రవిచంద్రగౌడ్, లిక్కిడి మహేందర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఇక్కడ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

***భీమారం మండల యువకులు..***

భీమారం మండలం ఒడ్యాడు, రాగోజిపేట గ్రామాలకు చెందిన 30మంది యువకులు శనివారం వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్, నాయకుడు అరిసెల్ల వెంకటేశ్, యువకులు పాల్గొన్నారు.

***బోయినపల్లి సమక్షంలో..***

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అభిమానులు వేములవాడలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలుపునకు కృషి చేస్తామని నినదించారు. ఇక్కడ జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, నాయకులు నెల్లుట్ల ప్రభాకర్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరినవారిలో భీమారం మండలం గోవిందారం మాజీ సర్పంచ్ జంగిలి రవీందర్, ఎస్ఎంసీ చైర్మన్ బాసోజీ శోభన్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు శివనూరి శ్రీనివాస్, బిటుకు నవీన్, మొగిల్ల గంగనర్సయ్య, జలంధర్, నరేశ్ ఉన్నారు.



మేడిపల్లి: పార్టీలో చేరిన యువకులతో చల్మెడ లక్ష్మీనరసింహారావు



మేడిపల్లి: బీఆర్ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్ జంగిలి రవీందర్, నాయకులతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, తుల ఉమ

## పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చూడాలి

- ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్ , నవంబర్ 18 : పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయంలో అన్ని మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 547 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని వసతులు కల్పించాలన్నారు. అన్ని మండలాల పోలింగ్ కేంద్రాల్లో ఓటరు సమాచార స్లిప్పులను ప్రతి ఓటరుకు అందించే విధంగా పర్యవేక్షించాలని సూచించా. ఈ నెల 21 నుంచి 25 వరకు 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 41 శాతం పైన ఉన్న అంగవైకల్యం ఉండి ఇంటి వద్దనే ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఇంటి వద్దనే ఓటు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశిత బృందాలు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి నిబంధనల ప్రకారం ఓటు హక్కు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, ఎస్‌డీసీ గంగయ్య, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, కలెక్టర్ పర్యవేక్షకుడు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

# ఇంటి వద్దకే ఓటు సౌకర్యం

- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- నియోజకవర్గంలో 539 మంది ఓటర్లు
- పర్యవేక్షణకు తొమ్మిది ప్రత్యేక బృందాలు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్

వేములవాడ, నవంబర్ 18: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కల్పించింది. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 40 శాతానికి పైగా అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఈ అవకాశాన్ని కల్పించింది. వేములవాడ నియోజకవర్గంలో 389 మంది వృద్ధులు దరఖాస్తు చేసుకోగా ఎన్నికల కార్డుల్లో ఉన్న వయసు ఆధారంగా 319 మందికి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. దివ్యాంగులు 385 మంది దరఖాస్తు చేసుకోగా 220 మంది అర్హత సాధించారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం 539 మంది వృద్ధులు, దివ్యాంగులు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్ద ఓటు వేసే అవకాశాన్ని పొందారు.

**సాధారణ ఎన్నికల్లో మొదటిసారిగా అవకాశం**

ఎన్నికల్లో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, గర్భిణులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం పరిపాటే. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో అవకాశం కల్పించిన ఎన్నికల అధికారులు, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది.


**తొమ్మిది ప్రత్యేక బృందాలు..**

ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల కోసం తొమ్మిది ప్రత్యేక బృందాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులు, పోలీస్ సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థుల ఏజెంట్లు ఉంటారు. పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. సదరు ఓటర్ ఇంటికి వెళ్లిన సమయంలో ఓటు హక్కు వినియోగించుకునే మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేసి భద్రపరచనున్నారు.

**21 నుంచి పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్**

వృద్ధులు, దివ్యాంగులు ఈ నెల 21 నుంచి ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశామని వేములవాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ తెలిపారు. 25వ తేదీ నాటికి మొత్తం దరఖాస్తు చేసుకున్న ఓటర్ల దగ్గరికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఓటు వినియోగించుకునే వారికి ముందస్తుగా సమాచారం ఇచ్చారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు**



80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 40 శాతానికి పైగా అంగవైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించింది. ఇప్పటికే బూత్ లెవల్ అధికారులతో సమాచారం అందించి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవగాహన కల్పించి దరఖాస్తు లు సేకరించాం. నియోజకవర్గంలో 539 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఈ ప్రక్రియ ఉన్నందున ఈ నెల 21న ప్రారంభించి 25వ తేదీ లోపు పూర్తి చేస్తాం. ఇందుకు తొమ్మిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నాం.

-మధుసూదన్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

## బీఆర్ఎస్‌కే రజకుల మద్దతు



వేములవాడ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్క రాజు శ్రీనివాస్, నాయకులు

వేములవాడ, నవంబర్ 18: వేములవాడ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రజకులు బీఆర్ఎస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నట్లు రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్క రాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం చల్మెడ నివాసంలో వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో సమావేశమై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బలపరిచిన లక్ష్మీనరసింహారావుకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో రజకులతో మాట్లాడి అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేస్తామన్నారు. ఇక్కడ రజక సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య, ఆయా మండలాల అధ్యక్షులు మొగిలి అంజయ్య, సుద్దాల నర్సయ్య, లింగంపల్లి గంగాధర్, లింగంపల్లి నర్సయ్య, భూమన్న, బాలయ్య, మహేశ్ ఉన్నారు.

## ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి



రత్నంపేటలో కవాతు నిర్వహిస్తున్న వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్

బోయినపల్లి, నవంబర్ 18: అసెంబ్లీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరగాలని, ఓటర్లందరూ సజావుగా ఓటుహక్కు వినియోగించుకోవాలని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ కోరారు. రత్నంపేటలో శనివారం కేంద్ర అదనపు బలగాలతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయపార్టీలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికలు, ఓటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే కేంద్రం నుంచి అదనపు బలగాలు పోలీస్ స్టేషన్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

కలెక్టరేట్ , నవంబర్ 18 : దివ్యాంగులు, వయో వృద్ధులు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీ రాజం సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 25 లోపు దివ్యాంగులు, వయోవృద్ధులు ఫారం 12 డీ ద్వారా హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి వద్దకే అధికారులు వెళ్లి రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తారన్నారు. దీనికి సంబంధించిన దరఖాస్తు ఫారం బూత్ లెవల్ అధికారుల ద్వారా పంపిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి సుచరిత, ఓల్డేజ్ హోమ్, డీ హబ్ సిబ్బంది, సఖి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో స్వయం పరిపాలనా దినోత్సవం

సిరిసిల్ల రూరల్, నవంబర్ 18: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శుభోదయ విద్యా సంస్థలు, మండెపల్లిలోని సరస్వతి విద్యానికేతన్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కరస్పాండెంట్లు శ్రీనివాస్ యాదవ్, కొక్కుల శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.